

తాడిపత్రి : నంది వాహనంపై బుగ్గ రామలింగేశ్వరస్వామి





మొదటిరోడ్డు శివాలయంలో పూజలు అందుకుంటున్న కాశీవిశ్వేశ్వరస్వామి, భక్తుల తాకిడి..



కాశీవిశ్వేశ్వరుడికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

శైవ క్షేత్రాల్లో ఆధ్యాత్మిక సందడి

- స్వామివారికి అభిషేకాలు, అర్చనలు
- లింగోద్భవ కాలంలో కల్యాణోత్సవం
- కాశీ విశ్వేశ్వరుడికి దగ్గుపాటి పట్టువస్త్రాలు

ఓం శివోహం..!

మహా శివరాత్రి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. జిల్లాలోని శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. క్యూ లైన్‌లలో నిలబడి మరీ శివపార్వతులను దర్శించుకున్నారు. అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవాలలో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు.

- అనంతపురం నగరంలోని మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో వేకువజాము నుంచే కాశీవిశ్వేశ్వరునికి రుద్రాభిషేకాలు, యామపూజలు నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరరావు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం శివపార్వతుల ఉత్సవ మూర్తులను నందివాహనంపై ఊరేగించారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత లింగోద్భవకాలంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు.
- శింగనమల భవానీ శంకరాలయంలో స్వామి, అమ్మవార్లకు ఎమ్మెల్యే బండారు శ్రావణి పట్టువస్త్రాలు, మాంగళ్యాన్ని సమర్పించారు. శివపార్వతులకు కల్యాణం జరిపించారు.
- తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామివారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, అర్చనలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తిని పుష్పాలతో అలంకరించి నంది వాహనంపై ఊరేగించారు.
- మహాశివరాత్రిని పురస్కరించుకుని గరళ కంఠుడిని స్మరిస్తూ భక్తులు ఉపవాస దీక్షలు చేశారు. ఆలయాలు, ఇళ్ల వద్ద ఆధ్యాత్మిక చింతన, భజనలతో రాత్రి జాగరణ చేశారు. స్వామివారికి ప్రియమైన గుగ్గిళ్లను నైవేద్యంగా సమర్పించారు.

\- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్



శివకోటి ఆలయంలో కల్యాణోత్సవం



అనంతపురం: చిన్మయ జగదీశ్వరాలయంలో పూజలను తిలకిస్తున్న భక్తులు



చిన్మయ జగదీశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న స్వామి ఆత్మవిదానంద సరస్వతి



పట్టు వస్త్రాలను తీసుకెళ్తున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

అనంతపురం 3వ రోడ్డులో గిరిజా కల్యాణం



సర్వం సిద్ధం..?

ఒకటో తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు

- 1 నుంచి ఫస్ట్ ఇయర్, 3 నుంచి సెకెండ్ ఇయర్
- 63 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 48,690 మంది

అనంతపురం విద్య, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి 15 వరకూ ప్రధాన పరీక్షలు నిర్వహించనున్నారు. 1వ తేదీ నుంచి ఫస్ట్ ఇయర్, మూడో తేదీ నుంచి సెకెండ్ ఇయర్ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 63 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు జరగనున్నాయి. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 25,730 మంది, సెకెండ్ ఇయర్ విద్యార్థులు 22,960 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రధాన పరీక్షలన్నీ ఇలా...

తేదీలు	ఫస్ట్ ఇయర్	తేదీలు	సెకెండ్ ఇయర్
మార్చి-1	సెకెండ్ లాంగ్వేజ్ పేపర్-1	మార్చి-3	సెకెండ్ లాంగ్వేజ్ పేపర్-2
మార్చి -4	ఇంగ్లీష్ పేపర్-1	మార్చి -5	ఇంగ్లీష్ పేపర్ -2
మార్చి -6	గణితం 1ఏ, బాటనీ, సివిక్స్ పేపర్-1	మార్చి -7	గణితం 2ఏ, బాటనీ, సివిక్స్ పేపర్-2
మార్చి- 8	గణితం -1బీ, జువాలజీ, హిస్టరీ పేపర్-1	మార్చి-10	గణితం -2బీ, జువాలజీ, హిస్టరీ పేపర్-2
మార్చి -11	ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-1	మార్చి-12	ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-2
మార్చి-13	కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ పేపర్-1	మార్చి-15	కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ పేపర్-2

ఐదు సిట్టింగ్ స్క్వాడ్, మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు

జిల్లా వ్యాప్తంగా 63 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రానికి ఇద్దరు చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియమించారు. సీనియర్ లెక్చరర్, పీడీ, లైబ్రేరియన్‌లలో ఇద్దరితో ఉండే సిట్టింగ్ స్క్వాడ్ టీంలు 5, పోలీస్ శాఖ నుంచి ఒక ఏఎస్ఐ, రెవెన్యూ నుంచి ఒక డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ లెక్చరర్‌తో కూడిన ముగ్గురు సభ్యులుంటే ఫ్లైయింగ్‌స్క్వాడ్‌లు మూడు బృందాలను నియమించారు. అదేవిధంగా 900 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమింగ్ ఉంటుంది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ కెమెరాలు పనిచేయనున్నాయి.



ఆర్ఐఓ కార్యాలయం

పోలీస్‌స్టేషన్లకు ప్రశ్నపత్రాలు...

ఇంటర్ ప్రశ్నాపత్రాలను స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పోలీసుల భద్రత నడుమ పరీక్షలు ఉన్న రోజుల్లో ప్రశ్నాపత్రాలను తెచ్చేందుకు సీఎస్, డీఓ ఉదయం 8 గంటలకే చేరుకోవాలి. బోర్డు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సూచించిన సెట్ ప్రశ్నాపత్రాలను 8.30 గంటలకు పోలీస్టేషన్ల నుంచి తీసుకుని పరీక్ష కేంద్రాలకు బయలుదేరాలి. కేంద్రాలకు చేరుకున్న తర్వాత 8.45 గంటలకు ప్రశ్నాపత్రాలను ఓపెన్ చేయాలి. 8.55 గంటలకు విద్యార్థులకు ప్రశ్నాపత్రాలను అందజేయాలి.

8 గంటలకే కేంద్రాలకు...

విద్యార్థులు ఉదయం 8 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలి. 8.30 గంటలకు పరీక్షాకేంద్రాల్లోకి పంపుతారు. విద్యార్థులు ఎవరూ సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, ఇతర డిజిటల్ పరికరాలను తమ వెంట కేంద్రాలోకి తీసుకుని వెళ్లరాదు. అదేవిధంగా పరీక్షల సిబ్బంది కూడా ఎవరూ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. కేవలం ఇంటర్ బోర్డు కేటాయించిన కీప్యాడ్ ఫోన్లు మాత్రమే చీఫ్ సూపరింటెండెంట్‌కు అనుమతి ఉంటుంది. నాన్ టీచింగ్ స్టాఫ్ సైతం ఉదయం 9 గంటల వరకూ కేంద్రాల్లో ఉండాలి. తర్వాత బయటకు వెళ్లిపోవాలి. మధ్యాహ్నం 12 గంటల తర్వాత నాన్ టీచింగ్ స్టాఫ్‌ను పరీక్షా పేపర్లను కట్టడం, ఇతర పనుల కోసం కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్షలు పూర్తయిన తర్వాత అన్ని కేంద్రాల నుంచి వచ్చే 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్లను జిల్లాకేంద్రంలోని న్యూటౌన్ బాయ్స్ కాలేజీలో ఉండే డిస్ట్రిక్ట్ రిసెప్షన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ (డీఆర్‌డీసీ)కి తరలించి భద్రపరుస్తారు.



ఆన్సర్ బుక్‌లెట్స్ భద్రపరిచే డీఆర్‌డీసీ కేంద్రం

ఆర్ఐఓ కార్యాలయంలో కంట్రోల్ రూం

వచ్చే నెల 1 నుంచి జరిగే ఇంటర్ పరీక్షల నిమిత్తం కంట్రోల్ రూంను ఆర్ఐఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. 08554-277626 నెంబర్‌ను అందుబాటులో ఉంచారు. విద్యార్థులు గానీ, తల్లిదండ్రులుగానీ, ఇతరులు ఎవరైనా పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే...వెంటనే కంట్రోల్ రూంకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చు.

గంట ముందే కేంద్రాలకు వెళ్లండి

జిల్లాలో 63 కేంద్రాల్లో కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహిస్తాం. మార్చి 1న ప్రారంభమై 15వ వరకూ ప్రధాన పరీక్షలన్నీ జరుగుతాయి. ముందు రోజే విద్యార్థులు సెంటర్లకు వెళ్లి తమ నంబర్లు సరి చూసుకుంటే మంచిది. జిల్లాలో 48,690 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారు. కేంద్రాల్లోకి ఎవరికీ సెల్‌ఫోన్లు అనుమతించం. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి 8 గంటలకే చేరుకోవాలి.



\-వెంకటరమణ, కన్వీనర్, పరీక్షల నిర్వహణ కమిటీ

బాల భైరవుడు



రామగిరి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బాల భైరవుడి చిత్రాన్ని పేరూరు గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీరాములు ఎంతో సుందరంగా చిత్రీకరించారు. ఆ చిత్రాన్ని బుధవారం పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు తిలకించి, ఉపాధ్యాయుడి చిత్రకళ నైపుణ్యానికి అభినందనలు తెలిపారు.

వన వైభవం..!



7

తవ్వేకొద్దీ అక్రమాలు..!

జగనన్న ఇళ్ల నిర్మాణంలో ఇష్టారాజ్యం

- ఇనుము, సిమెంట్ అక్రమ తరలింపు
- తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ ఇంజనీరు బాగోతం..
- కలెక్టర్ వద్దకు చేరిన ఫైల్



రాప్తాడులోని జగనన్న కాలనీ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇళ్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలు తవ్వేకొద్దీ బయటకు వస్తూనే ఉన్నాయి. ఈ పథకం పేదలకు పెద్దగా ఉపయోగపడకపోయినా హౌసింగ్ ఇంజనీర్లకు మాత్రం జేబులు నింపింది. లబ్ధిదారుల ఎంపిక మొదలు నిర్మాణం, నిధుల చెల్లింపు, మెటీరియల్ సరఫరా వరకు అక్రమాల పుట్టగా మారింది. జిల్లాలోనే అత్యధికంగా మంజూరైన రాప్తాడు నియోజకవర్గంలో అక్రమాలు భారీగా జరిగాయి. రాప్తాడుకు 8,894 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో రూ.3కోట్ల వరకు నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు విజిలెన్స్ అధికారులు తేల్చారు. ఓ ఇంజనీరు ఇనుము, సిమెంటు అక్రమంగా విక్రయించి రూ.20లక్షలు స్వాహా చేయడంపై తాజాగా విచారణ చేపట్టారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపారు. అప్పట్లో రాప్తాడులో పనిచేసిన ఇంజనీరు ప్రస్తుతం అనంతపురానికి దగ్గరలో ఉన్న మరో నియోజకవర్గానికి బదిలీలపై వెళ్లారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంజనీరుపై వేటు వేస్తారా లేక రికవరీ చేసి మందలించి వదిలేస్తారా అనేది ఆ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వెలుగులోకి ఇంజనీరు బాగోతం

అనంతపురానికి అతి సమీపంలో ఉన్న నియోజకవర్గంలో ఇన్‌చార్జి డీఈగా పనిచేస్తున్న ఓ ఇంజనీరు చేసిన బాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆ ఇంజనీరు పనిచేసిన స్థానంలో ఇప్పటికే విజిలెన్స్ విచారణ ఎదుర్కొని బదిలీ వేటు పడింది. ఈ క్రమంలో మరో అవినీతి ఘటన వెలుగుచూసింది. ఇదే విషయంపై అంతర్గతంగా విచారణ చేసి విచారణ అధికారి కలెక్టర్ వద్దకు ఫైల్ చేర్చారు. ఇనుము, సిమెంట్ సుమారు రూ.20లక్షల వరకు విక్రయించుకుని సొమ్ము చేసుకున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. గతంలో కూడా ఆ ఇంజనీరు రూ.50 లక్షలకు పైగా నిధులు స్వాహా చేసిన వ్యవహారాన్ని విజిలెన్స్ విచారణలో తేల్చినట్లు చెబుతున్నారు. ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరిగి 24 మంది ఇంజనీర్లపై సస్పెన్షన్ వేటు పడింది.

రాప్తాడులోనే అధికంగా అక్రమాలు

జగనన్న కాలనీల అక్రమాల్లో అత్యధికంగా రాప్తాడులోనే వెలుగుచూశాయి. దీనిపై ప్రస్తుత ఎమ్మెల్యే కూడా ఏపీ రాష్ట్ర గృహనిర్మాణ శాఖ అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. స్పందించిన హౌసింగ్ అధికారులు మరోసారి విజిలెన్స్ విచారణ చేపట్టాలని సూచించినట్లు సమాచారం. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే సేవలో మునిగితేలిన హౌసింగ్ ఇంజనీర్లు చేసిన అక్రమాలు అన్నీఇన్నీ కావంటున్నారు ఆశాఖలో ఉద్యోగులు. రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ పరిధిలోని నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద జరిగిన అక్రమాలపై కొందరు ఉద్యోగులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.3కోట్ల వరకు అక్రమంగా బిల్లులు చేసినట్లు ఇంతకు ముందే విజిలెన్స్ విచారణలో గుర్తించారు. అవే అక్రమాలపై మరోసారి విజిలెన్స్ విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం లేకపోలేదు.

ఫిర్యాదులపై విచారణ చేయిస్తాం

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేయిస్తాం. గతంలోనే విజిలెన్స్ విచారణ జరిగింది. తాజాగా చేసిన విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపాం. సిమెంటు, ఇనుము విక్రయాలపై విచారణ చేయించాం. ప్రభుత్వం నుంచి వచ్చిన స్టాక్, లబ్ధిదారులకు పంపిణీ చేసిన స్టాక్‌కు తేడా వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తాం.



\-శైలజ, పీడీ, గృహ నిర్మాణశాఖ

రేపు రాయదుర్గంలో డీఐఈపీసీ సమావేశం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాన్ని ఈనెల 28న రాయదుర్గం పట్టణం టెక్స్‌టైల్ పార్క్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతినెలా నాలుగో శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ నెల నాలుగో శుక్రవారం 28న రాయదుర్గంలోని టెక్స్‌టైల్ పార్క్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారన్నారు. కమిటీ సభ్యులు ఈ సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కుడి కాలువకు నీరు బంద్



కుడి కాలువలో ఆగిపోయిన నీటి ప్రవాహం

కూడేరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పెన్న అహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కుడికాలువకు వస్తున్న నీటిని అధికారులు బుధవారం నిలిపివేశారు. మూడు రోజులుగా కాలువలో నీటి ప్రవాహం తగ్గించారు. ప్రస్తుతం పీఏబీఆర్ డ్యాంలో 3.099 టీఎంసీల నీటి నిల్వ ఉందని ఇరిగేషన్ ఏఈ లక్ష్మీదేవి తెలిపారు. డ్యాంలోఉన్న నీటి ప్రాజెక్టులో తాగునీటి అవసరాల కోసం నీటిని నిల్వ చేసినట్లు ఆమె వెల్లడించారు.

అప్పుల ఉరికి యువరైతు బలి

అనంతపురంలో గురుగుంట్ల రైతు ఆత్మహత్య



యోగేంద్ర (ఫైల్)

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శింగనమల మండలం గురుగుంట్ల గ్రామానికి చెందిన రైతు యోగేంద్ర(28) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఓబులేసు, ఆదిలక్ష్మమ్మ దంపతులకు యోగేంద్ర ఏకైక కుమారుడు. వారికున్న రెండెకరాల పొలంలో వరి, వేరుశనగ తదితర పంటలను సాగుచేశారు. కొంత భూమిని కౌలుకు కూడా తీసుకుని వ్యవసాయం చేసేవాడు. గత ఐదేళ్లుగా సరైన దిగుబడి రాకపోవడం, పంట సాగుకు చేసిన అప్పుల మొత్తాలు పెరిగి పోయాయి. ఇలా రూ.20లక్షల వరకు అప్పులభారం పెరిగిపోయింది. యోగేంద్ర తండ్రి ఓబులేసు మూడేళ్ల కిందట మరణించారు. ఈ నేపథ్యంలో యోగేంద్ర నగరానికి వచ్చి బేల్దారి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గుత్తిరోడ్డులోని మసీదు కొట్టాలవద్ద రామిరెడ్డి కాలనీలో గుడిసెలో నివాసముంటూ నగరంలో బేల్దారు పనులకు వెళ్లేవాడు. వ్యవసాయానికి చేసిన అప్పులు, వడ్డీలు చెల్లించే మార్గం కనిపించకపోవడంతో బుధవారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వాళ్లు ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. మృతుడికి తల్లి ఆదిలక్ష్మమ్మ, భార్య రామాంజినమ్మ, నాలుగేళ్ల కూతురు హిమజ ఉన్నారు. మమ్మల్ని దిక్కులేనివారిగా వదిలేసి వెళ్లిపోయావా అని తల్లి, భార్య కన్నీరుమున్నీరుగా విలపించం అందరినీ కలచివేసింది.

వన వైభవం..!



నర్సరీలో పంపిణీకి సిద్ధమవుతున్న మొక్కలు

- ☆ కూటమి పాలనలో అటవీ శాఖలో అభివృద్ధి పరుగులు
- ☆ జిల్లాలో పచ్చదనం పెంపునకు చర్యలు
- ☆ 15 నర్సరీల్లో 30 లక్షల మొక్కలు సిద్ధం చేసేలా ప్రణాళిక
- ☆ పండ్ల మొక్కలకూ ప్రాధాన్యం
- ☆ రహదారుల పక్కన బ్యూటిఫికేషన్‌కు చర్యలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పచ్చదనం పెంపునకు అటవీ శాఖాధికారులు చర్యలు ముమ్మరం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో నిర్వీర్యమైన నర్సరీలు కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వేగంగా కోలుకుంటున్నాయి. అటవీ శాఖ బాధ్యతలు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల్లో ఉండటం బాగా కలిసి వస్తోంది. నిధులకు ఇబ్బంది లేదన్న ఆలోచనతో శాఖ సిబ్బంది కూడా అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు జిల్లాలోని 12 మండలాల్లో ఉన్న 15 నర్సరీల్లో 30 లక్షల మొక్కల పెంపు శ్రీకారం చుడుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. గతంలో అవసరాలకు అనుగుణంగా నీడను ఇచ్చే మొక్కలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ వాటినే నర్సరీల్లో అందుబాటులో ఉంచేవారు. ఈ ఏడాది పండ్లమొక్కలు సైతం అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నారు. రహదారుల పక్కన మరింత బ్యూటిఫికేషన్‌కు చర్యలు చేపడుతున్నారు. గతంలో నాటిన మొక్కల పరిస్థితి ఏంటి? ప్రస్తుతం నూతనంగా ఎక్కడెక్కడ రోడ్లు వేశారు, అక్కడ ఎన్ని మొక్కలు అవసరం అవుతాయి? ఎలాంటివి నాటితే రోడ్లకు ఇరువైపులా మంచి ఆహ్లాదకరంగా ఉంటుందన్న వివరాలు సేకరిస్తున్నారు.

వైసీపీ పాలనలో నిర్వీర్యం

గత వైసీపీ ప్రభుత్వం అటవీ శాఖకు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసింది. దీంతో నర్సరీల్లో మొక్కలు కనిపించకుండా పోయాయి. పైసా నిధులు కేటాయించిన పాపాన పోలేదు. వెరసి.. వర్షాలు సమృద్ధిగా కురిసినా.. నర్సరీల్లో మొక్కలు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలకే పరిమితమయ్యారు. మిగిలిన ప్రాంతాల్లో పచ్చదనం పెంపునకు మంగళం పలికారు. సిబ్బంది సైతం కార్యాలయానికి వచ్చామా? వెళ్లామా.. అన్న చందంగా వ్యవహరించారు.

30 లక్షల మొక్కల పెంపునకు ఏర్పాట్లు

జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు పెంచడానికి నర్సరీల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా 15 నర్సరీల్లో 30 లక్షల మొక్కలు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నారు. వీటిలో 15 లక్షలు మాత్రమే ఈ ఏడాదికి వినియోగించనున్నారు. మరో 15 లక్షలు అవసరాలకు అనుగుణంగా ఎత్తైన మొక్కలు వచ్చే ఏడాదికి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపడుతున్నారు. వీటికి సంబంధించి ఇప్పటికే గ్రౌండింగ్ పనులు పూర్తయ్యాయి. అనంతపురం, ఉరవకొండ, శింగనమల, బుక్కరాయసముద్రం, పుట్లూరు, తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, రాయదుర్గం, కుందుర్పి, గుమ్మఘట్ట తదితర ప్రాంతాల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచడానికి శ్రీకారం చుట్టారు.



నర్సరీల్లో మొక్కల పెంపునకు సిద్ధం చేస్తున్న సిబ్బంది

15 నర్సరీల్లో మొక్కలు సిద్ధం



జిల్లాలో అవసరాలకు అనుగుణంగా 15 నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాం. వీటిలో పండ్ల మొక్కలు సైతం ఉన్నాయి. వాటిని గ్రామాల్లో ఇంటి పరిసరాలు, ఖాళీ ప్రదేశాల్లో నాటించి, సంరక్షణను స్థానికులకే అప్పగిస్తాం.

- చంద్రశేఖర్, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ

పండ్ల మొక్కలకు ప్రాధాన్యం

నీడనిచ్చే మొక్కలే కాకుండా పండ్లను ఇచ్చే మొక్కలను సైతం నర్సరీల్లో అందుబాటులో ఉంచేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జామ, ఉసిరి, దానిమ్మ, శీతాఫలం, నేరేడు తదితర 40 రకాల పండ్ల మొక్కలను అందుబాటులో ఉంచనున్నట్లు యంత్రాంగం చెబుతోంది.

అవెన్యూ ప్లాంటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ

హైవేలకు ఇరువైపులా మొక్కలు నాటనున్నారు. అనంతపురం నుంచి గుత్తి మీదుగా హైదరాబాద్ రోడ్డుకు గతంలో నాటిన మొక్కల పరిస్థితి ఏంటి? ప్రస్తుతం ఎక్కడెక్కడ మొక్కలు నాటాల్సి ఉంది, ఎన్ని, ఎలాంటివి అన్న అంచనాలు తయారు చేస్తున్నారు. పెనుకొండ వైపు బెంగళూరు రోడ్డుకు సైతం ఇదే తరహాలో చర్యలు చేపట్టనున్నారు. తాడిపత్రి రోడ్డును ఇటీవలే విస్తరించారు. ఆ రోడ్డు పక్కన ఎక్కడెక్కడ మొక్కలు అవసరం అన్నది అంచనాలు తయారు చేసి, అనుమతుల మంజూరుకు శ్రీకారం చుట్టారు. కొత్తగా నిర్మాణం చేపట్టనున్న రోడ్లకిరువైపులా మొక్కలు నాటేలా వివరాలు సేకరిస్తున్నారు.

బైక్ చోరీల కేసులో ఇద్దరి అరెస్ట్

పట్టుకున్న పోలీసులకు రివార్డులు



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు, నిందితులతో పోలీసులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బైక్‌ల చోరీలకు పాల్పడే ఇద్దరు దొంగలను అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పదిరోజుల కిందట బళ్లారి బైపాస్‌లో హోండా షైన్, మారుతీనగర్ ఫస్ట్ క్రాస్‌లో హీరో స్ప్లెండర్ బైక్‌లు చోరీ అయ్యాయి. నగరంలోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన పాత నేరస్తుడైన చాకలి మధు, పెనుకొండకు చెందిన నరసింహులును సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్ఐ రమేష్, కానిస్టేబుళ్లు ప్రణేష్, మహేష్‌లను జిల్లా ఎస్పీ అభినందించి ప్రోత్సాహక రివార్డులు అందజేశారు.

చీనీ టన్ను రూ.23వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23,560 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8,400, సరాసరి రూ. 16,220తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 118 టన్నుల కాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 450 టన్నుల దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

నార్పల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దిగుమర్రి రోడ్డులో బుధవారం ఓ ఇంట్లో పట్టపగలే దుండగులు చోరీకి పాల్పడ్డారు. నార్పలకు చెందిన చర్చి ఫాదర్ డెవిడ్ ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో కలిసి బత్తలపల్లికి వెళ్లాడు. దీన్ని గమనించిన దుండగులు తాళలు పగలగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాలో ఉన్న 4తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. ఇంటికి వచ్చిన డెవిడ్ తాళాలు పగలగొట్టి ఉండగా చోరీ జరిగిందని భావించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపాడు.

శివయ్య సేవలో ఎంపీలు అంబికా, బీకే



లేపాక్షిలో నిర్వహించిన శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ అంబికా



పెనుకొండ కాశీవిశ్వేశ్వర ఆలయంలో శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న బీకే

ఎమ్మెల్యే అమిలినేని చొరవతో కార్మికులకు జీతాలు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులకు రెండు నెలల జీతం లభించింది. ఐదు నెలల జీతాలు రాకపోవడంతో ఈ నెల 18న కళ్యాణదుర్గం బైపాస్ వద్ద నీటి పథకం కార్మికులు సమ్మె చేశారు. దీంతో ఎమ్మెల్యే పంపుహౌస్ వద్దకు వెళ్లి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న కాంట్రాక్టర్లతో మాట్లాడి జీతాలు త్వరగా ఇచ్చే ఏర్పాట్లు చేయాలని సూచించారు. మార్చి 3వ తేదీ జీతాలు రాకపోతే తన సొంత నిధులు ఇస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు వెంటనే సమ్మె విరమింపజేసి విధుల్లో చేరారు. ఈక్రమంలోనే రెండు నెలల జీతాలు అందజేశారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజక వర్గాల్లో 200 మందికి జీతాలు అందినట్లు కార్మికులు తెలిపారు.

సస్పెండైన అధికారుల స్థానాల్లో ఇన్‌చార్జ్‌లు

- హిందూపురం సీటీఓగా మురళీమనోహర్
- డీసీటీఓలుగా ఒక డీసీటీఓ, ఇద్దరు ఏసీటీఓలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ హిందూపురం సర్కిల్‌లో సస్పెన్షన్‌కు గురైన అధికారుల స్థానాల్లో ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సీటీఓ, ముగ్గురు డీసీటీఓలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. డిప్యూటీ కమిషనర్ మురళీమనోహర్‌ను ఇన్‌చార్జ్ సీటీఓగా నియమించారు. ఇన్‌చార్జ్ డీసీటీఓలుగా పుట్టపర్తి డీసీటీఓ సురేశ్‌కుమార్‌రెడ్డి, పుట్టపర్తి ఏసీటీఓ అనిల్, హిందూపురం ఏసీటీఓ చంద్రశేఖర్‌లను నియమించారు. గురువారం వారు ఇన్‌చార్జ్ బాధ్యతలను చేపట్టనున్నారు. డిప్యూటీ కమిషనర్ మురళీమనోహర్ బాధ్యతలు తీసుకుంటారా..? లేదా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

సెలవులోనైనా వెళ్తా... చార్జ్ తీసుకోను

హిందూపురంలో పన్నుల శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టడానికి అధికారులు వెనుకడుగేస్తున్నారు. ఓ అధికారి హిందూపురంలో బాధ్యతలా...వద్దు బాబోయ్ అంటున్నారట. అవసరమైతే సెలవులో వెళ్తా కానీ అక్కడ మాత్రం పనిచేయనని చెప్పారట. ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు కానీ ఆయన చార్జ్ తీసుకుంటారో లేదో చూడాలి.

నీరాశే

- హెచ్చెల్సీ ఆయకట్టుకు నీటి గండం
- పంటలకు మార్చి వరకు నీరు అవసరం
- బోరుబావులను వేధిస్తున్న లోఓల్టేజ్ సమస్య



రంగాపురం క్యాంప్ వద్ద నెర్రెలు ఇచ్చిన వరి మాగాణి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీకి తుంగభద్ర నీరు ఆగిపోవడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. సరిపడా నీరు వస్తాయన్న ఆశతో రైతులు విస్తారంగా పంటలు సాగు చేశారు. కనీసం మార్చి 15 వరకు అయినా నీరు వస్తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం అర టీఎంసీ అదనంగా నీరు రావడం వల్ల కొంతవరకు ప్రయోజనం కలిగినా, పంట మొత్తానికి చాలదని రైతులు నిరాశ చెందుతున్నారు. దీనికి తోడు బోరుబావుల ద్వారా పంటలు పండించుకుందామనుకున్నా లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. దీంతో సాగుచేసిన పంటలు వాడుముఖం పడుతున్నాయి. ఇది వరకే హెచ్చెల్సీకి కోటా పూర్తి కావడంతో ఈ నెల 10 నుంచి కాలువకు నీటి విడుదలను బోర్డు అధికారులు నిలిపివేశారు. మరో 20 రోజులు పాటు పుష్కలంగా నీరు వచ్చి ఉంటే పంట దిగుబడులు బాగుండేవని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హెచ్చెల్సీకి ఈ సారి 30.354 టీఎంసీల నీరు అందాయి. జిల్లాకు తాగునీటి అవసరాల కోసం 3 టీఎంసీలను కేసీ కెనాల్ కేటాయింపుల నుంచి హెచ్చెల్సీకి మళ్లించారు. దీంతో ఈ ఏడాది జిల్లాకు 33.354 టీఎంసీల నీరు అందింది. ప్రస్తుతం మరో అర టీఎంసీ అదనంగా విడుదల చేస్తున్నారు.

నెర్రెలు చీలిన వరి చేలు

మండలంలోని రంగాపురం క్యాంప్, ఉద్దేహాళ్, గోనేహాళ్, ఉప్పరహాళ్, దేవగిరి, హరేసముద్రం తదితర గ్రామాలలో వరి పంటను సాగు చేశారు. హెచ్చెల్సీకి నీరు ఆగిపోవడంతో పంటకు వ్యవసాయబోర్ల నీరు చాలక వరి చేలు నెర్రెలు వదులుతున్నాయి. నెర్రెలువారిన భూమిని చూసి ఆరుగాలం శ్రమంతా వృథా అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చి రెండో వారం వరకు నీరు వస్తే రెండు తడులు తడిస్తే వరి పంట కొంత వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. లేకపోతే ధాన్యం తాలుపడి నష్టపోయే పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ లోఓల్టేజ్ కారణంగా మరింత నీటి ఎద్దడి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మరో టీఎంసీ తీసుకుంటేనే...

కేసీ కెనాల్ నుంచి 0.5 టీఎంసీల నీటిని హెచ్చెల్సీకి రెండోసారి విడుదల చేయడంతో రైతులు ఆనందిస్తున్నా, ఈ నీరు పంట పండటానికి చాలదని రైతులు అభిప్రాయ పడుతున్నారు. కేసీకెనాల్ వాటా ఆరు టీఎంసీలు ఉండటంతో ప్రభుత్వ పెద్దలు తుంగభద్ర బోర్డు అధికారులపై ఒత్తిడి తెచ్చి మరో టీఎంసీ తీసుకుంటే పంటలకు జీవం పోసినట్లు ఉంటుందని రైతులు అంటున్నారు. ఇప్పుడు వచ్చే నీరు జీబీసీకి వెళ్లాలని ఇక్కడి రైతులు నీటిని వాడుకోకుండా అధికారులు కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా అయితే వచ్చిన అర టీఎంసీలో కూడా ఇక్కడ పంటలకు అందే పరిస్థితి ఉండదని రైతులు అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి బోర్డు అధికారులతో మాట్లాడి మరో టీఎంసీని తీసుకురావాలని కోరుతున్నారు.

బోర్లలో నీరు రావడంలేదు



విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులతో పాలు పోసుకునే దశలో ఉన్న మొక్కజొన్న పంటకు నీటి ఎద్దడి ఏర్పడుతోంది. లోఓల్టేజ్ సమస్య కారణంగా మొక్కజొన్న పంట ఎండుతోంది. మరో వైపు తడులు అవసరమైన వేరుశనగ, వరి పంటలను సైతం నీటి సమస్య వేధిస్తోంది. విద్యుత్‌లో వోల్టేజీ సమస్యతో బోరుబావుల నుంచి వచ్చే నీరు కూడా తగ్గిపోయింది.

-సంజప్ప, రైతు, దేవగిరి గ్రామం

రెండు తడులు ఇచ్చింటే బాగుండేది



ఆయకట్టు కింద సాగు చేసిన వరి పంటకు తుంగభద్ర నీరు ఇంక రెండు తడులు ఇచ్చింటే బాగుండేది. తుంగభద్రలో ఉన్న నీటిపై ఆశతో ఈ సారి రైతులు వరి పంటను సాగు చేశారు. ఫిబ్రవరిలోనే నీటిని ఆపేయడంతో పంటపై ఆశలు వదలుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ బోర్లలో కూడా నీరు అంతంత మాత్రమే వస్తున్నాయి. పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు.

-ఈశ్వర, రైతు, శ్రీధరఘట్ట

పంటలను కాపాడాలి



రబీసీజన్‌లో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఎండిపోతున్న సమయంలో అర టీఎంసీ నీరు రావడం ఆనందంగా ఉంది. అయితే ఈ నీళ్లు పొలాలకు సరిపడవు. మార్చి 15వ తేదీ వరకు నీరు వస్తే బాగుంటుంది. ఇప్పుడు వచ్చే నీరు పొలాలలోకి వస్తాయన్న ఆశ లేదు.

- ఎర్రిస్వామి, రైతు, శ్రీధరఘట్ట

యువకుడిని కాపాడిన పోలీసులు



రామాంజనేయులును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రూరల్ సీఐ శేఖర్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు యత్నిస్తున్న ఓ యువకుడిని రూరల్ పోలీసులు కాపాడారు. సీఐ శేఖర్ తెలిపిన మేరకు... కూడే రు మండలం జల్లిపల్లికి చెంది న రామాంజనేయులు ఐటీఐ చదువుకుని జీవనాధారం కోసం టీస్టాల్ నిర్వహిస్తుండేవాడు. ఇటీవల ఇల్లు కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో రూ.4.5లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కానరాక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయమై స్నేహితుడైన రాముకు వాట్సాప్ ద్వారా బుధవారం మధ్యాహ్నం సమాచారం పంపాడు. దీంతో ఆందోళన చెందిన రాము తనకు పరిచయమున్న ఆత్మకూరు ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్‌కు సమాచారం పం పాడు. అతను అనంతపురం ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్ శీనాకు చేరవేశాడు. వారి నుంచి రూరల్ సీఐ శేఖర్‌కు సమాచారం అందగా...బ్లూకోల్ట్ కానిస్టేబుళ్లు దేవేంద్ర, నాగేంద్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సోములదొడ్డి సమీపంలో ఉన్న రామాంజనేయులు వద్దకు చేరుకున్నారు. అప్పటికే రామాంజనేయులు బైక్ టైర్ ట్యూబ్‌కు తాను ధరించిన చొక్కాను కట్టి చెట్టుకు ఉరివేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు గమనించిన కానిస్టేబుళ్లు అతడిని కాపాడారు. ఐదు నిమిషాలు ఆలస్యమై ఉంటే ఉరి వేసుకుని ఉండేవాడు. కౌన్సెలింగ్ అనంతరం రామాంజనేయులును అతడి బంధువులకు అప్పగించారు.

బ్లాక్‌మెయిల్ చేసిన విద్యార్థిపై కేసు

ఓ విద్యార్థినిని ఫొటోల పేరుతో బ్లాక్ మెయిల్ చేసిన విద్యార్థిపై ఇటుకపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ హేమంత్‌కుమార్ తెలిపిన మేరకు... ఎస్కే యూనివర్సిటీలో బీటెక్ చేస్తున్న ఓ విద్యార్థినితో, లైబ్రేరియన్ కోర్సు చదువుతున్న మరో విద్యార్థితో పరిచయమైంది. ఇద్దరూ సన్నిహితంగా మెలిగారు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి ఫొటోలు దిగారు. అయితే ఫొటోల పేరుతో తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని విద్యార్థిపై ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో ఇటుకలపల్లి పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు, వేధింపుల కేసు నమోదు చేశారు.

న్యూస్ బాక్స్

2న విద్యుత్ సంస్కరణలపై అవగాహన

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతవూరు అమ్మవారిశాలలో మార్చి 2వ తేదీన 'విద్యుత్ సంస్కరణలు- ప్రజలపై భారం' అనే అంశంపై అవగా హన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు రసూల్ తెలిపారు. నగరంలోని మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణంలో బుధవారం ఐక్యవేదిక సభ్యుల సమావేశం నిర్వహించారు. మార్చి 2న జరిగే కార్యక్రమంలో నగర ప్రజలు, ప్రజాసంఘాల సభ్యులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటేష్, సోమర రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు నిధులు కేటాయించాలి

● ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఏపీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి సబ్‌ప్లాన్ చట్టం-2013 ప్రకారం నిధులు కేటాయించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ బుధవారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... ప్రస్తుత ఎస్సీ ఎస్టీల జనాభా ప్రాతిపదికన సబ్‌ప్లాన్ కింద కనీసం రూ.46వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి ఎస్సీ, ఎస్టీల అభివృద్ధిని నిర్వీర్యం చేసిందని విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కేంద్రకమిటీ సభ్యులు సోమశేఖర్, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ఆటోకు నిప్పు

● కాలిపోయిన ఓ దినపత్రిక ప్రతులు



అగ్నికి ఆహుతైన ఆటో

గార్లదిన్నె, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కనుంపల్లి సమీపాన 44వ జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున గుర్తు తెలియని దుండగులు ఓ ప్రధాన దిన పత్రిక ఆటోకు నిప్పు అంటించారు. ఓ ప్రధాన పత్రిక ప్రతులను అనంతపురం నుంచి పామిడి, వజ్రకరూరు తదితర మండల కేంద్రాలకు ప్రతి రోజూ ఆ ఆటోలో తీసుకువెళ్తారు. రోజూ మాదిరాగానే బుధవారం వేకువజామున పామిడి వైపుకు ఆటో వెళ్తోంది. కనుంపల్లి సమీపంలోకి రాగానే గుర్తుతెలియని దుండగులు అడ్డగించి ఆటోకు నిప్పు పెట్టి ఉడాయించారు. ఆటో డ్రైవర్ ద్వారా సమాచారం తెలుసుకున్న ఆ పత్రిక ఉద్యోగులు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకొని సందర్శించారు. అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, అనంతపురం రూరల్, బీకేఎస్, పామిడి, ఇటుకలపల్లి సీఐలు శేఖర్, కరుణాకర్, యుగంధర్, హేమంతుతో పాటు క్లూస్ టీం, అగ్నిమాపక సిబ్బంది వెళ్లి పరిశీలించారు. అప్పటికే ఆటో పూర్తిగా కాలిపోయింది. పత్రికా ఉద్యోగుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు.

బెల్లం ప్రపంచాన్ని సందర్శించిన బుల్లితెర నటులు



బెల్లం ప్రపంచంలో బుల్లితెర నటులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బెల్లం ప్రపంచాన్ని బుల్లితెర నటులు సందర్శించారు. రూరల్ మండల పరిధిలోని పాములాయి సమీపంలో జాతీయ రహదారి పక్కన హెచ్చెల్సీ ఉద్యోగి, తైక్వాండో శాంతరాజ్‌కు సంబంధించిన బెల్లం ప్రపంచాన్ని బుధవారం బుల్లితెర నటులు గడ్డం నవీన్, సునామీ సుధాకర్, చిట్టిబాబు, మోహన్ సందర్శించారు. ఎటువంటి రసాయనాలు కలుపకుండా శాస్త్రీయంగా బెల్లం తయారు చేసి సమాజానికి అందించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగిగా విధి నిర్వహణలో, క్రీడాకారుడిగి తైక్వాండో క్రీడాకారుల సేవలో ఉంటూ, మరోవైపు సమాజ సేవలో శాంతరాజ్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శేఖర్, లీగల్‌మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్, తైక్వాండో శాంతరాజ్, థెరిసా తదితరులు పాల్గొన్నారు.



శివబాలయోగి ఆశ్రమంలో భక్తుల సహస్రలింగార్చన

హరహర మహదేవ.. శంభో శంకర

● వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

● భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలను బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఊరూవాడా అంతటా శివనామస్మరణతో మార్మోగింది. చిన్నా.. పెద్దా అందరూ ఆలయాలకు చేరుకుని ముక్కంటిని దర్శించుకున్నారు. స్వామి నామస్మరణ చేస్తూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. జిల్లా కేంద్రంలో ఆరోరోడ్డులోని అమృత లింగేశ్వ రాలయంలో రుత్వికుల వేదమంత్రోచ్చారణ నడుమ శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రామచంద్రనగర్‌లోని టీటీడీ కల్యాణమండపంలో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జాగరణ మహోత్సవం చేపట్టారు. పరిషత్ సభ్యుడు శ్రీపాద వేణు నేతృత్వంలో ఆధ్యాత్మిక ప్రశ్నల పోటీలు నిర్వహించడంతోపాటు భజనలు, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కాలభైరవ కంకణాలను వితరణ చేశారు. మూడోరోడ్డులోని జీఆర్ ఫంక్షన్‌హాల్‌లో అనంత శివారాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాశీవిశ్వేశ్వర లింగానికి భక్తుల చేతులమీదుగా అభిషేకాలు చేయించారు. సాయంత్రం గిరిజా కల్యాణం నిర్వహించారు. రామచంద్ర నగర్ షిర్డీసాయిబాబా ఆలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పూజలు చేశారు. శివబాలయోగి ఆశ్రమంలో శివకామేశ్వరులకు భక్తుల చేత క్షీరాభిషేకం, బిల్వార్చన, సహస్రలింగార్చన చేయించారు. అదేవిధంగా మంచులింగం ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పాతూరులోని చెన్నకేశవ స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రజలు పెద్దఎత్తున దర్శించుకున్నారు. సాయంత్రం శివలింగాన్ని ప్రత్యేకం గా అలంకరించిన వాహనంపై ఉంచి ఊరేగించారు. అలాగే బెంగళూరు రోడ్డులోని శివకోటి, హౌసింగ్‌బోర్డు వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని శివాలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, అరవిందనగర్ సర్వేశ్వ రాలయం, పాతూరు విరూపాక్షేశ్వరాలయం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆల యం, అశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయం, హెచ్చెల్సీ కాలనీ మంజునాథ స్వామి దేవాలయం, చాముండేశ్వరి దేవాలయంతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న శివాలయాలన్నింటిలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మూడోరోడ్డులోని జీఆర్ ఫంక్షన్‌హాల్‌లో..



బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగం

కూటమితోనే ఆలయాలకు శోభ: ఎమ్మెల్యే దగ్గుపాటి



నగరోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో ఆలయాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఆలయాలకు శోభ వచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో వేడుకలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ముఖ్యఅతిథిగా హాజరై స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం శివపార్వతుల నగరోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా భక్తులకు ప్రసాదాల పంపిణీ చేశారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఆలయాలకు దేవదాయశాఖ ద్వారా అన్ని రకాలుగా సహకారం అందిస్తోందన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సాకే రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, బలిజ యువజన సంఘం అధ్య క్షుడు రమేష్ రాయల్, నలుబోలు మధురాయల్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

● రాంనగర్ బ్రిడ్జి కింద పార్కు నిర్మాణానికి భూమిపూజ



పార్కు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక రాంనగర్ ఫ్లైఓవర్ కింద పార్కు నిర్మాణానికి ఎమ్మెల్యే బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీడీపీ హయాంలోనే రాంనగర్ ఫ్లైఓవర్ నిర్మించారని, గత వైసీపీ పాలనలో కనీసం చిన్న అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రూ.కోటి నిధులు తీసుకొచ్చి, బ్రిడ్జి కింద పార్కు నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. ఈ పార్కులో పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం, జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. గత ఐదేళ్లలో గాడితప్పిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, టీడీపీ నాయకులు గోళ్ల సుధాకర్ నాయుడు, పీఎల్ఎన్ మూర్తి, కడి యాల కొండన్న, ముక్తియార్, బాలాంజినేయులు, లక్ష్మీనరసింహ, సైఫుద్దీన్, చేపల హరి, దాడి మల్లికార్జున, గోపాల్ గౌడ్, వెంకటేశ్వరరెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు తోపుడుబండి అందజేత

అనంపురం అర్బన్ పరిధిలోని అశోక్‌నగర్‌కు చెందిన సుజాత అనే మహిళకు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ తోపుడు బండిని అందజేశారు. ఇటీవల మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో... సుజాత, ఆమె భర్త నాగభూషణం ఎమ్మెల్యేని కలిశారు. తోపుడు బండిని అద్దెకు తీసుకొని చిరు వ్యాపారంతో జీవిస్తున్నామని, ఆ బండి అద్దె కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నామని సుజాత, ఆమె భర్త నాగభూషణం వివరించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి బుధవారం టీడీపీ అర్బన్ కార్యాలయం వద్ద సుజాతకు తోపుడు బండిని అందించారు. త్వరలోనే రుణ సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి సుజాత కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంగారామ్, సరిపూటి రమణ, సుధాకర్ యాదవ్, మణికంఠ బాబు, మనోహర్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఫెన్సింగ్ జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా ఫెన్సింగ్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో బుధవారం జిల్లాస్థాయి ఫెన్సింగ్ అండర్-14 బాల, బాలికల కేటగిరిలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జిల్లా క్రీడాకారుల వివరాలను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యద ర్శులు మురళీకృష్ణ, పుష్పావతి వెల్లడించారు. బాలుర విభాగంలో కార్తికే య, సాయి, ఫణికుమార్, దుర్గ విహాన్ యాదవ్, రియాన్, సూరజ్‌ఆహిల్, స్నేహిత్ సింహ, నూర్‌అబ్దుల్లా, అమన్, కృష్ణదేవరాయ, సద్విన్, అఖీబ్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో వందనారెడ్డి, ముక్తాంబిక, సంజనాబాయి, రక్ష, నయని, చిన్మయి, శ్రావణి, పూజ్యరత్నం, అన్విచౌదరి ఎంపికైన వారిలో ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఎన్టీఆర్ జిల్లాలో మార్చి 2న నిర్వహించే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ లక్ష్మీ, కోచ్‌లు రాహుల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొ న్నారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం జేఎన్‌టీ యూ వీసీ సుదర్శనరావు ఎమ్మెల్యే దగ్గుపాటిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరువురు చర్చించారు. గత ఐదేళ్లల్లో యూనివర్సిటీలు రాజకీయాలకు వేదికలుగా మా రాయని, కూటమి ప్రభుత్వంలో అలాంటి అవకాశం లేదని ఎమ్మెల్యే అన్నా రు. వర్సిటీ అభివృద్ధికి తమవైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా చూడండి

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని వాల్మీకి సంఘం నాయకులు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు వాల్మీకి సంఘం నాయకులు మణి రవి, మాధవయ్య, క్రాంతికుమార్, పోత న్న, కుళ్లాయప్ప, శంకర్ తదితరులు బుధవారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటికి వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ... అసెంబ్లీల్లో తప్పకుండా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని ప్రస్తావిస్తానన్నారు. వాల్మీకి సంఘం నాయకులు ఆదినారాయణ, పెద్దన్న, గోపాల్, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు



అలంకరణలో కోన మల్లికార్జున స్వామి

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం ఉదయం నుంచే దర్శనానికి భక్తులు బారులు తీరారు. ముఖ్యంగా చెన్నేకొత్తపల్లి సమీపంలోని కోనకణ్వాశ్రమంలో శివరాత్రి ఉత్సవాలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు మల్లికార్జున స్వా మికి జలాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. రాత్రి 12గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం అత్యంత కమనీయంగా సాగింది.

కన్నులపండువగా శివపార్వతుల కల్యాణం

● పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులు



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించు కుని శింగనమలలోని భవాని శంకర స్వామి దేవాలయంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులు బుధవారం మండలంలో ప్రసిద్ధి చెందిన శింగనమల చిన్నకాలువ భవాని శంకర దేవాలయం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాత్రికి శివపార్వతుల కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాలు, మంగళ సూత్రం సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణ, మేళతాళాల నడుమ శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలని పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశామని ఎమ్మెల్యే వెల్లడించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

కాలభైరవుడికి కుంభాభిషేకం



పూజల్లో పాల్గొన్న ఆర్డీఓ కేశవనాయుడు, నాయకులు కేశవరెడ్డి, రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సిద్దరాంపురం గ్రామంలో పురాతనమైన కాలభైరవ స్వామి దేవాలయం గోపుర పునఃప్రతిష్ఠ సందర్భంగా బుధవారం ఆలయంలో కుంభాభిషేక మహోత్సవం నిర్వహించారు. మూడు రోజుల నుంచి దేవాలయంలో వేదపండితులు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం మహా శివరాత్రి పర్వదినం పురస్కరించు కుని గోపుర పునఃప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవానికి అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జయరామిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మారిన విద్యుత్ లైన్లు



రుద్రంపేటలో ఏర్పాటు చేసిన కొత్త విద్యుత్ లైన్లు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చేపట్టిన 'మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమం' వల్ల చాలా ప్రజా సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. రుద్రంపేట పంచాయతీలో పరిస్థితే ఇందుకు నిదర్శం. ఇటీవల ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పంచాయతీలో మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ క్రమంలో స్థానికులు పలు విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే విద్యుత్ ఎస్ఈ, ఇతర అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. రెండురోజులుగా విద్యుత్ సమస్యల పరిష్కారానికి పనులు జరుగుతున్నాయి. స్థానికంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ సౌకర్యంలేని కాలనీకి కొత్తగా విద్యుత్ లైన్ లాగారు. పాత ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 12 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సమస్యల రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించినట్లు తెలుస్తోంది. స్థానికంగా సమస్యలు పరిష్కారం అవుతుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విధాతా.. విశ్వనాథా..!



● రాప్తాడు: మండలంలోని రాప్తాడు, ప్రసన్నాయపల్లి, గొంది రెడ్డిపల్లి, బండమీదపల్లి, మరూరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధికసంఖ్యలో స్వామిని దర్శిం చుకున్నారు. బండమీదపల్లిలో శివుడి చిత్రపటాన్ని ఊరేగించారు.

● నార్పల: మండల కేంద్రంతో పాటు గూగూడు, తుంపెర, పప్పూరు, బండ్లపల్లి, కేశేపల్లి తదితర గ్రామాల్లో బుధవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నార్పలలోని శివాలయంలో అర్చకులు రాఘవేంద్ర ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు.





● రామగిరి: మండలకేంద్రంలోని కాశీవిశ్వనాథ స్వామి దేవాల యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. కంచుకుంట వీరభద్ర స్వామి ఆలయం, పేరూరు విశ్వేశ్వరాలయం, నసనకో ట, కుంటిమద్ది తదితర గ్రామాల్లోని శివాలయాలు, రామగిరి సమీపం లోని కర్ణాటక కోన మల్లేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

● గార్లదిన్నె: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఇల్లూరు, కల్లూరు, మర్తాడు, కోటంక, బూదేడు, పెనకచెర్ల తదితర గ్రామాల్లో శైవక్షేత్రాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్లూరులో జగ్గాలరవి యూత్ ఆధ్వర్యంలో వెంకీ మామ కళాకారుల బృందంచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.





తాడిపత్రిలో ప్రత్యేక అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు



ఉరవకొండ గవిమఠంలో ప్రత్యేక అలంకరణలో గవిసిద్దేశ్వరుడు

హర.. హర.. మహాదేవ

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- శివాలయాల్లో ప్రత్యేక పూజలు
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: మహాశివరాత్రి వేడుకలు బుధవారం పెద్దఎత్తున జరిగాయి. ఈ సందర్భంగా అన్ని ప్రాంతాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అర్చకులు సుప్రభాత సేవ చేసి మూలవిరాట్‌లకు రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు జరిపారు. అలాగే విశేష అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మధ్యరాత్రి 12గంటల సమయంలో లింగోద్భవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల వద్ద పలువురు భక్తులు జాగారణ చేశారు.



బ్రహ్మసముద్రం మండలం బైరసముద్రంలో రుద్రలింగేశ్వరుడి రథాన్ని లాగుతున్న భక్తులు



కళ్యాణదుర్గంలోని కోటవీధిలో భవాని శంకరాలయంలో శివపార్వతుల కల్యాణం



యాడికి మండలంలో కోన రామలింగేశ్వర స్వామి



పామిడిలో భోగేశ్వరుడు



గుత్తిలో నగరేశ్వర ఆలయంలో పోటెత్తిన భక్తులు



గుంతకల్లు మండలంలో అలంకరణలో బుగ్గ సంగమేశ్వరుడు



రాయదుర్గం మండలంలో పశుపతి నాథుడు



కూడేరు సంగమేశ్వరాలయం వద్ద ఎస్‌ఏపీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

కుడి కాలువకు నీరు బంద్

కూడేరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పెన్న అహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కుడికాలువకు వస్తున్న నీటిని అధికారులు బుధవారం నిలిపివేశారు. గత మూడు రోజులుగా కాలువలో నీటి ప్రవాహం తగ్గించారు. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 3.099 టిఎంసీల నీటి నిల్వ ఉందని ఇరిగేషన్ ఏఈ లక్ష్మీదేవి తెలిపారు. డ్యాంలోని తాగునీటి ప్రాజెక్టు నుంచి తాగునీటిని సరఫరా చేయడానికి పీఏబీఆర్‌లో నీటిని నిల్వ చేశామని చెప్పారు.

రథం ఏర్పాటుకు పలువురి విరాళం

కూడేరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జోడులింగాల సంగమేశ్వర స్వామి నూతన రథం ఏర్పాటుకు బుధవారం పలువురు విరాళాలు అందజేశారు. స్థానికంగానే ఉన్న బొమ్మినేని ఎర్రిస్వామి రూ.1,00,116, కడదరకుంట గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ రూ.25 వేలు, గోసుల భార్గవ రాముడు రూ.25వేలు, అశ్వర్థనారాయణరెడ్డి రూ.25 వేలు ఆలయ అధికారులకు అందజేశారు.



విరాళం అందజేస్తున్న బొమ్మినేని ఎర్రిస్వామి

సంక్షిప్త వార్తలు

సోలార్ ప్యానల్స్, కేబుల్ చోరీ

గుత్తిరూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంగిలిబండ గ్రామంలో శశికుమార్‌కి చెందిన పొలంలో బుధవారం తెల్లవారుజామున సోలార్ ప్యానల్, వ్యవసాయ మోటర్‌కు ఉన్న కేబుల్ చోరీకి గురయ్యాయి. ఉదయం తన పొలంలోకి వెళ్లి చూడగా సోలార్ ప్యానల్, వ్యవసాయ మోటర్ కేబుల్ కనిపించలేదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు చెప్పారు. అవి రూ.3లక్షలు విలువజేస్తాయన్నారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పీహెచ్‌సీ తనిఖీ

కూడేరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి వైద్య సిబ్బందితో మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మోడల్ పీహెచ్‌సీలో సిబ్బంది కొరతను త్వరలోనే తీరుస్తామని తెలిపారు.

విలీన సభ పోస్టర్ల విడుదల

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో మార్చి 2వ తేదీన జరిగే ఐఎఫ్‌టీయూ విలీన సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ సురేష్ కోరారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో బుధవారం ఆయన ఈ మేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు హనమంతు, రామాంజినేయులు, నాయకులు పాల్గొన్నారు.

రేపు పంచాయతీ సర్వసభ్య సమావేశం

ఉరవకొండ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ మేజరు పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన పంచాయతీ సర్వ సభ్యసమావేశాన్ని నిర్వహించనున్నట్లు కార్యదర్శి గౌస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు సర్పంచ్ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. వార్డు సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

చౌడేశ్వరీదేవికి వెండి కిరీటం సమర్పణ

ఉరవకొండ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉరగాద్రి చౌడేశ్వరీ దేవి అమ్మవారికి రిటైర్డ్ ఉద్యోగి రాజశేఖర్ కుటుంబసభ్యులు బుధవారం వెండి కిరీటాన్ని బహూకరించారు. రూ.1.25లక్షల వ్యయం చేసి కిలో వెండితో తయారు చేయించిన కిరీటాన్ని ఆలయ చైర్మన్ కొత్తశరత్‌కు అందజేశారు. ఆ కిరీటాన్ని అమ్మవారికి అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సేవాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు కిరీటాన్ని అందజేస్తున్న దాత

మీ కోసం చేశాం..

రికవరీ సొమ్ము మీరే కట్టండి

నిండా మునిగాం..!

- వైసీపీ నేతలతో ఉపాధి సిబ్బంది వాగ్వాదం
- అవినీతి చేస్తే ఇబ్బందులు తప్పవని మీకు తెలీదా?
- నేతల మండిపాటు
- ఖంగుతిన్న సిబ్బంది
- ఎంపీడీఓ కార్యాలయంలో రహస్య సమావేశం

మీరు చెప్పినట్లు చేసిన పాపానికి మాపై క్రిమినల్ కేసులు పెట్టారు. మా కుటుంబాలను వీధిన పడేశారు. ఇప్పుడు మమ్ములను ఎవరు కాపాడతారు? రికవరీ పేరుతో రూ.లక్షలు చెల్లించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎవరో తిన్న డబ్బు మేం ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలి? ఆ డబ్బు మీరే చెల్లించండి.

-ఉపాధి సిబ్బంది

మాకేం సంబంధం, మీరు ఎవడికి బిల్లులు చేశారో, ఏమో? మీ ఇష్టం వచ్చినట్లు రికార్డులు చేసి, ఎవడికి పడితే వాడికి బిల్లులు ఇచ్చి మాపై వేయటం సరికాదు. మీకు తెలియకుండా బిల్లులు మంజూరు చేసి ఉంటారా? అవినీతికి పాల్పడిన సొమ్ము మీరే కట్టుకోండి. అవినీతికి పాల్పడే ముందు మీకు తెలియదా.. బయటపడితే ఇబ్బంది అవుతుంది అని..

-వైసీపీ నాయకులు



ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం

విడపనకల్లు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారం క్రితం ఓ రహస్య సమావేశం జరిగినట్లు సమాచారం. అదో అవినీతి మీటింగ్ అని తెలిసింది. మండలంలో ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడి క్రిమినల్ కేసులు ఎదుర్కొటున్న సిబ్బంది. వైసీపీ నాయకులతో రహస్యంగా భేటీ అయినట్లు తెలిసింది. మండలంలో గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులతో ఉపాధి సిబ్బంది కుమ్మక్కై, వారు చెప్పినదానికి తలూపుతూ వచ్చారు. అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. వైసీపీ నాయకులు చెప్పిందే వేదంగా పాటిస్తూ.. నిబంధనలను గాలికొదిలేశారు. ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నారు. ఉపాధిలో అక్రమాలను ఇటీవల నిగ్గుతేల్చారు. బాధ్యులపై క్రిమినల్ చర్యలకు ఉపక్రమించారు. ఆ మేరకు ఉన్నతాధికారులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిన్న సొమ్ము కట్టాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉపాధి సిబ్బంది దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

8 మందిపై క్రిమినల్ కేసు

2023-2024 సంవత్సరంలో చేసిన ఉపాధి హామీ పనులకు ఇటీవల సామాజిక తనిఖీ నిర్వహించారు. అందులో వైసీపీ నాయకుల అక్రమాలు రూ.కోట్లలో బయటపడ్డాయి. మండలంలోని పాల్తూరు, ఆర్ కొట్టాల, వేల్పుమడుగు, కరకముక్కల, విడపనకల్లు, గ్రామాల్లో బోగస్ జాబ్ కార్డులు సృష్టించి, రూ.లక్షల్లో అవినీతికి పాల్పడినట్లు స్పష్టమైంది. ఎంపీడీఓ(పీఓ), ఏపీఓ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు కుమ్మకై వైసీపీ నాయకులు చెప్పినట్లుగా బోగస్ బిల్లులు చేశారు. సామాజిక తనిఖీల్లో పక్కా ఆధారాలతో అవినీతిని బయట పెట్టారు. దాదాపు రూ.1.19 కోట్లు అవినీతికి పాల్పడినట్లు తేల్చారు. జిల్లా అధికారులు మాత్రం కేవలం రూ.18లక్షలు రికవరీకి ఆదేశించారు. 8 మంది సిబ్బందిపై విడపనకల్లు పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు పెట్టారు.



ఎంపీడీఓ కార్యాలయం

అయోమయం..

క్రిమినల్ కేసులు, రూ.లక్షలు కట్టాల్సి రావడంతో ఉపాధి సిబ్బంది దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులతో రహస్య సమావేశం అయ్యారు. 'మీరు చెప్పినట్లు చేసి, రోడ్డున పడ్డామనీ, రికవరీ డబ్బు మీరే కట్టాల'ని ఉపాధి హామీ సిబ్బంది.. వైసీపీ నాయకులతో గట్టిగా వాదించినట్లు తెలిసింది. 'అవినీతి చేసేటపుడు మీకు తెలీదా.. ఇబ్బందులు తలెత్తుతాయ'ని అంటూ వైసీపీ నాయకులు తిట్ల దండకం అందుకోవడంతో ఉపాధి సిబ్బంది ఖంగుతిన్నారు. మీరే కట్టుకోవాలంటూ తెగేసి చెప్పారు. దీంతో ఉపాధి సిబ్బంది దిక్కుతోచని స్థితిలో పడ్డారు. రికవరీ డబ్బు కట్టేదెలా, ఉద్యోగాలు కాపాడుకునేదెలా, క్రిమినల్ కేసులు ఎదుర్కొనేదెలా అంటూ ఉపాధి సిబ్బంది వాపోతున్నారు. వైసీపీ నాయకులు ఇంత మోసం చేస్తారని ఊహించనే లేదంటూ ఓ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలు కాజేసి, ఆ డబ్బు తాము కట్టాలనడం ఏం న్యాయమని నిట్టూర్చారు.

పశుపతినాథుడి సేవలో ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చదంగొల్లలదొడ్డి గ్రామ సమీపంలో వెలసిన పశుపతినాథుడి ఆలయంలో శివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామికి పలు అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. స్వామివారి ఆలయాన్ని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కుటుంబసమేతంగా సందర్శించుకున్నారు. అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించి ప్రత్యేక అర్చనలు, పూజలు జరిపించారు. అనంతరం కాలవ మాట్లాడుతూ .. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసి దక్షిణ భారతదేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా మారుస్తామని ప్రకటించారు. ఎంతో ప్రాశస్త్యమైన ఈ ఆలయ అభివృద్ధికి త్వరలోనే ఒక నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామన్నారు. మూడు దశల్లో ఈ ఆలయ అభివృద్ధిని చేపడతామని పేర్కొన్నారు. టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, మాజీ కౌన్సిలర్ టంకశాల హనుమంతు, నాయకులు సోమశేఖర్, హనుమంతరెడ్డి, తిప్పేస్వామి, ఓబయ్య, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



పశుపతినాథస్వామిని దర్శించుకుంటున్న విప్ కాలవ

బుగ్గ రామలింగేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆయన సతీమణి జేసీ ఉమారెడ్డి సందర్శించారు. ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు. ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పురాతనమైన ఆలయాలను కాపాడుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బుగ్గరామలింగేశ్వరాలయం ప్రహరీ దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని, ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి పురావస్తుశాఖ అధికారులతో మాట్లాడి మరమ్మతు చేసేందుకు ముందుకు వచ్చారని అన్నారు. ఆయనతో పాటు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఆలయాలను రక్షించాలని కోరారు. ఇప్పుడు ఆలయంలో అక్కడక్కడ మరమ్మతులు చేయాలంటే దాదాపు 2 కోట్లు ఖర్చు అవుతుందని, తాను సొంత నిధులు పెట్టి చేయిస్తానని పేర్కొన్నారు.



బుగ్గ రామలింగేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, ఆయన తల్లి ఉమారెడ్డి

ఎణ్ణే రంగనాథేశ్వరుడి రథోత్సవాలు ప్రారంభం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ గ్రామంలో ఎణ్ణేరంగనాథేశ్వర స్వామి వారి రథోత్సవ వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం గంగాజలం తెచ్చి ఆలయంలోని స్వామివారిని అభిషేకించారు. అలాగే పంచామృతాభిషేకం, అష్టోత్తర రుద్రాభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. తర్వాత ప్రత్యేక పూజలు చేసి మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. గురువారం సాయంత్రం 5 గంటలకు రథోత్సవంను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో ఎణ్ణే రంగనాథేశ్వరుడు

వెండి కవచాల అందజేత

తాడిపత్రి, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న వేదమాతగాయత్రీ, అమరలింగేశ్వరస్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి, వినాయకుడికి 5 కిలోల వెండి కవచాలను స్థానికుడైన వార్డెన్ నాగిరెడ్డి అందజేశారు. ఆలయనిర్వాహకులకు బుధవారం వాటిని అందించారు. వాటివిలువ రూ.5లక్షల వరకు ఉంటుందని వారు తెలిపారు.



వెండి కవచాల అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి, వినాయకుడు

జ్యోతిర్లింగాల ఏర్పాటుకు రూ.1,00,116 అందజేత

బెళుగుప్ప, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయం ప్రాంగణంలో భక్తుల దర్శనార్థం జ్యోతిర్లాంగాల నమూనాల ఏర్పాటుకు బుధవారం స్థానిక టీడీపీ నాయకుడు పెద్దతిప్పయ్య రూ. 1,00,116లు వితరణ చేశారు. శివరాత్రి ఉత్సవాలలో ఆలయ కమిటీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, కోళకుర్తి ధనుంజయరెడ్డిలకు దాత, కుటుంబ సభ్యులైన భార్య ఈశ్వరమ్మ కుమార్తెలు శ్రీలేఖ, స్నేహలతో కలిసి నగదు అందజేశారు. ఆలయంలో జ్యోతిర్లింగాల ఏర్పాటుకు ముందుకి రావడం పట్ల దాతను అర్చకులు తిప్పేస్వామి, శివశంకర, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఈశ్వరప్ప అభినందించారు.



జ్యోతిర్లింగాల ఏర్పాటుకు ఆర్థికసాయం అందిస్తున్న దాత

పోలీస్ స్టేషన్ తనిఖీ

బెళుగుప్ప, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ట్రైనీ ప్రాక్టికల్ డీఎస్పీ అర్షద్ అలీ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై, హోమ్‌గార్డు నుంచి ఎస్‌ఐ వరకు విధులు తదితర వాటిపై నెలరోజులు ఈ మండలంలోనే శిక్షణ తీసుకోన్నట్లు చెప్పారు. కడప జిల్లాకు చెందిన తాను 2023 బ్యాచ్ గ్రూప్ 1లో ఎంపికైనట్లు చెప్పారు. ప్రధానంగా శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

972 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 972 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ ఎస్ ఫేజ్-2కు 818 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. రిజర్వాయరులో ప్రస్తుతం 1.621 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

వైద్యం వికటించి చిన్నారి మృతి

ఆస్పత్రివద్ద తల్లిదండ్రుల ఆందోళన

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ నర్సింగ్ హోమ్‌లో చిన్నపిల్లల వైద్యుడి నిర్లక్ష్యంతో 8 నెలల బాలుడు బుధవారం మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు ఆరోపించారు. ప్రైవేట్ ఆసుపత్రుల అసోసియేషన్ వైద్యులు అక్కడికి చేరుకుని బాలుడి కుటుంబంతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాలుడి మృతదేహాన్ని తల్లిదండ్రులు స్వగ్రామానికి తీసుకెళ్లారు. పోలీసులు, బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అయ్యావారిపల్లికి చెందిన ప్రభాకర్, కిరణ్‌మేరి దంపతులకు అజయ్‌కుమార్ అనే ఎనిమిది నెలల బాలుడు ఉన్నాడు. ఆరోగ్యం బాగా లేదని సోమవారం ఓ నర్సింగ్‌హోమ్‌లోని చిన్నపిల్లల డాక్టర్ వద్దకు వెళ్లారు. బాలుడిని పరీక్షించి అడ్మిట్ చేసుకున్నారు. బుధవారం ఉదయం బాలుడి పరిస్థితి విషమంగా ఉందని, కర్నూలుకు రెఫర్ చేస్తున్నట్లు డాక్టర్ చెప్పారు. కానీ, బాబు అప్పటికే ఆసుపత్రిలోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ మనోహర్, ప్రైవేట్ ఆసుపత్రుల అసోసియేషన్ వైద్యులు ఆసుపత్రికి చేరుకున్నారు. కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు అంబులెన్సులో బాలుడి మృతదేహాన్ని అయ్యావారిపల్లికి తీసుకెళ్లారు. బాలుడి మృతిపై వివరణ కోరేందుకు వైద్యుడి కోసం ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు.



మృతి చెందిన బాలుడు

43 నేరేడు చెట్లు నరికివేత

తాడిపత్రి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామంలో శ్రీనివాసులుకు చెందిన 43నేరేడు చెట్లను మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు నరికివేశారు. ఈ మేరకు బాధిత రైతు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి నరికివేతకు గురైన చెట్లను పరిశీలించారు. ఎవరిపైన అయినా అనుమానం ఉందా అని రైతును పోలీసులు ఆరా తీశారు. తనకు ఎవరితోనూ ఎలాంటి గొడవలు లేవని, ఎందుకు ఇలా చేశారో అర్థం కావడం లేదని ఆయన వాపోయాడు. దాదాపు మూడు సంవత్సరాల చెట్లను నరికివేశారన్నారు. ఎంతో ఖర్చుపెట్టి చెట్లను సాగు చేశారని చెప్పారు. ఓర్వలేకనే ఎవరో నరికివేసి ఉంటారని వాపోయాడు. ప్రభుత్వం గుర్తించి నష్టపరిహారం ఇచ్చేవిధంగా చూడాలని ఆయన కోరారు.



చెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

నాటు సారా నిర్మూలనపై అవగాహన

గుత్తి రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ. కొత్తపల్లి, జక్కలచెరువు, ఈశ్వరపల్లి గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి నాటు సారా నిర్మూలనపై అవగాహన సదస్సు లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. నాటు సారా వల్ల ఆరోగ్యాలు ఎంతగానో దెబ్బ తింటాయన్నారు. అంతేకాకుండా సారా తాగే కుటుంబాలు ఆర్థికంగా కూడా చితికిపోయే ప్రమాదముందన్నారు. కనుక ఎవరూ కూడా నాటుసారా జోలికి వెళ్లరాదని సూచించారు. నాటు సారా నిర్మూలనకు ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఈశ్వరపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ, సిబ్బంది